దినమిక్ జనం వాయిస్
RNI No:TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# మంత్రి పొంగులేటి అహంకార వైఖరిని ఖండిస్తున్నాం: బీసీ సమాజ్

- కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ నాయకులకు అడుగడుగునా అవమానాలు.
- మంత్రి వాకిటి శ్రీహరి ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి.
- బీసీల ఆత్మగౌరవం కోసం ఉద్యమిస్తాం: నరెడ్ల శ్రీనివాస్ హెచ్చరిక.

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి, మే 26:**
రాష్ట్ర మంత్రివర్గంలో ఉన్న బీసీ నాయకుడు, మంత్రి వాకిటి శ్రీహరిపై సహచర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రదర్శించిన అహంకారపూరిత వైఖరిని బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అగ్రవర్ణాల ఆధిపత్య ధోరణి ఇంకా కొనసాగుతూనే ఉందనడానికి ప్రభుత్వంలో చోటుచేసుకున్న ఈ తాజా పరిణామాలే నిదర్శనమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలను ఉద్ధరిస్తున్నామని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీలోనే బీసీ నాయకులకు అడుగడుగునా అవమానాలు జరుగుతున్నాయని, పేరుకే బీసీ మంత్రులు ఉన్నప్పటికీ ప్రభుత్వ వ్యవస్థలో ఆధిపత్య కులాల ప్రాబల్యమే కొనసాగుతోందని విమర్శించారు. దేశంలో, రాష్ట్రంలో 50 శాతానికి పైగా జనాభా కలిగిన బీసీ వర్గాలకు ఇప్పటికీ సరైన గౌరవం, రాజకీయ



ప్రాధాన్యం దక్కకపోవడం బాధాకరమని నరెడ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరిపై జరిగిన ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా పీసీసీ అధ్యక్షుడు చొరవ తీసుకుని, బీసీ నాయకుడిని అవమానించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బీసీలను అంతర్గతంగా అవమానిస్తూ, అణగదొక్కే రాజకీయ ధోరణులను ఇకపై ఎంతమాత్రం సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలన్నింటినీ త్వరలోనే ఏకం చేస్తామని, బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు పెద్ద ఎత్తున ఉద్యమాత్మక కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. బీసీల పట్ల నిర్లక్ష్య వైఖరిని వీడకపోతే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా తగిన గుణపాఠం చెబుతామని బీసీ సమాజ్ తరపున ఆయన హెచ్చరించారు.

## బీసీ మంత్రులను అవమానించిన పొంగులేటి బహిరంగ క్షమాపణ చెప్పాలి

- పదవుల కోసం ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు: తెలంగాణ రాజ్యాధికార పార్టీ డిమాండ్.
- మంచిర్యాల జిల్లా నేత మహేష్ వర్మ హెచ్చరిక.

**జనం వాయిస్, మంచిర్యాల ప్రతినిధి, మే 26:**
మంచిర్యాల: తోటి మంత్రులనే గౌరవించని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇక సామాన్య ప్రజలకు ఏ విధంగా న్యాయం చేస్తారని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా నాయకుడు మహేష్ వర్మ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, బీసీ మంత్రుల పట్ల అగ్రవర్ణ అహంకారాన్ని ప్రదర్శిస్తూ కొందరు శునకానందాన్ని పొందుతున్నారని ఆయన మండిపడ్డారు. సొంత క్యాబినెట్ లోని బీసీ మంత్రులకే ఇలాంటి అవమానాలు జరుగుతుంటే.. తోటి బీసీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు స్పందించకపోవడం బీసీ సమాజానికే సిగ్గుచేటని, కేవలం పదవుల కోసమే ఆత్మగౌరవాన్ని చంపుకుని వారు పదవుల్లో కొనసాగుతున్నారని విమర్శించారు. బీసీల పక్షాన బలమైన నాయకుడు తీన్మార్ మల్లన్న ఉన్నారని, బీసీ నాయకుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకే తెలంగాణ రాజ్యాధికార పార్టీ పనిచేస్తోందని మహేష్ వర్మ స్పష్టం చేశారు. బీసీలను తక్కువ చేసి చూస్తున్న నాయకులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, రానున్న రోజుల్లో బీసీ, బహుజనుల రాజ్యాధికారం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బహిరంగంగా బీసీ మంత్రులకు, బీసీ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో బీసీ సంఘాలను, నాయకులను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మంచిర్యాల జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున ఆయన హెచ్చరించారు.



## గిరిజనులకు ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చని ప్రభుత్వం.

**మాజీ మంత్రి సత్యవతి రాథోడ్.**

**మరిపెడ(మే 26)జనం వాయిస్:**
లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద జరిగిన చలో హైదరాబాద్ మహా ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీష్ రావు,సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు.సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ,ఎన్నికల ముందు గిరిజనుల ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ,అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనులను పూర్తిగా మోసం చేసిందని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రతి విషయంలో గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని,లగచర్ల నుండి నేటి గిరిజన హామీల వరకు ఇదే పరిస్థితి ఉందన్నారు.జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో 12 హామీల గిరిజన డిక్లరేషన్ అమలు చేస్తామని లక్షల మంది సమక్షంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు.గిరిజన ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని ఇప్పటివరకు అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు.

**గిరిజన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలం.సత్యవతి రాథోడ్.**

గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచింది కేసీఆర్ మాత్రమేనని ఆమె అన్నారు.3146 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి,మన తండాలో మన రాజ్యమే అనే నినాదానికి న్యాయం చేసింది కేసీఆరే అన్నారు.తెలంగాణలో లంబాడీలు సహా గిరిజనుల ఆత్మగౌరవం,అభివృద్ధి కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని స్పష్టం చేశారు.

**గిరిజన రిజర్వేషన్ల పెంపు**



విద్య,ఉద్యోగాల్లో గిరిజనులకు ఉన్న 6% రిజర్వేషన్లను 10%కి పెంచుతూ కేసీఆర్ నిర్ణయం తీసుకుని అమలు చేశారన్నారు.

**ఆదివాసీ,బంజారా భవన్**

హైదరాబాద్ బంజారాహిల్స్‌లో కోట్లాది రూపాయల వ్యయంతో సద్భావన బంజారా భవన్ నిర్మించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని ఇనుమడింపజేశారన్నారు.పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో అత్యధిక సంఖ్యలో గురుకుల పాఠశాలలు మంజూరు చేశారని చెప్పారు.పోడు భూములకు పట్టాలు ఇచ్చింది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు.కళ్యాణ లక్ష్మి పథకం కూడా లంబాడీలను దృష్టిలో పెట్టుకొని తీసుకొచ్చినదేనని అన్నారు.

**సేవాల్ మహారాజ్ జయంతి**

సంత్ సేవాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు,బంజారా తండాలను అభివృద్ధి పథంలో నడిపించింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు.కాంగ్రెస్ పార్టీ యావత్ గిరిజన ప్రజానీకాన్ని మభ్యపెడుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీ గిరిజనుల సహనాన్ని పరీక్షించొద్దు.హక్కుల కోసం మా ఐక్య పోరాటం మరింత ఉధృతం అవుతుంది అని హెచ్చరించారు.గిరిజనులను మోసం చేసిన కాంగ్రెస్‌కు గిరిజనులే త్వరలో తగిన బుద్ధి చెబుతారని అన్నారు.మనకు రావాల్సిన నిధులు,విధులు,హక్కులు నెరవేరేవరకు పోరాటం ఆగదని సత్యవతి రాథోడ్ తెలియజేశారు...

## యాభై ఏళ్ల నాటి స్నేహం.. అంబలి పంపిణీతో సేవా పంథం!

మంచిర్యాల జెడ్పీహెచ్ఎస్ 1972-73 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**జనం వాయిస్, మంచిర్యాల, మే 26**
మంచిర్యాల: మంచిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1972-73 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం మధ్యాహ్నం 1:00 గంటకు స్థానిక 'అంజలి డ్రెస్సెస్' ఎదుట ప్రత్యేకంగా సమావేశమై, సమాజ సేవలో భాగంగా ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. సారయ్య, పురుషోత్తం, కంటె విశ్వనాథం, కోలీవ సదాశివ్, వి. వెంకటేశ్వరరావు, డి.పి. రావు, ఐ. సూర్యనారాయణ, ఇ. జాన్, పి. మోహన్, జి. ఉమాధవ్, చ. రాజబ్రహ్మం, పి. రంగారావు, ఎం. కుమారస్వామి తదితరులు ఒకచోట చేరి, తమ పాఠశాల రోజులను, నాటి తీపి గుర్తును నెమరువేసుకుంటూ ఆత్మీయంగా క్షేమసమాచారాలు పంచుకున్నారు. కాలం మారినా తమ మధ్య ఉన్న స్నేహబంధం చెక్కుచెదరలేదని చాటిచెప్పిన ఈ సమ్మేళనం అందరిలో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని అందరూ ఏకగ్రీవంగా ఆకాంక్షించారు.




## అనారోగ్యంతో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

**జనం వాయిస్, మంచిర్యాల, మే 26**
తీవ్ర అనారోగ్య సమస్యలతో మనస్తాపానికి గురై ఒక రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పాత మంచిర్యాల ప్రాంతానికి చెందిన ఆడె భీమయ్య (68) సింగరేణి సంస్థలో పని చేసి పదవీ విరమణ పొందారు. గత కొంతకాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీని కోసం పలు ఆసుపత్రులలో చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం నయం కాకపోవడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. ఈ క్రమంలోనే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి భీమయ్య ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న సీఐ ప్రమోద్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రిటైర్డ్ ఉద్యోగి మృతితో స్థానికంగా విషాద ఛాయలు అలముకున్నాయి.

## జన్నారంలో అకాల వర్షం బీభత్సం

ఎస్.కె. గార్డెన్ పైకప్పు ధ్వంసం.
ఈదురు గాలుల ధాటికి ఎగిరిపోయిన ఇనుప రేకులు.. భారీగా ఆస్తి నష్టం.

**జనం వాయిస్, మంచిర్యాల (మే 26):**
మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో మంగళవారం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం, తీవ్రమైన ఈదురు గాలులు కలకలం సృష్టించాయి. ఈ అకాల వాతావరణ మార్పుల వల్ల స్థానిక ఎస్.కె. గార్డెన్ ఫంక్షన్ హాల్ పైకప్పు పూర్తిగా చిన్నాభిన్నమైంది. అతివేగంగా వీచిన గాలుల ధాటికి పైకప్పుకు సంబంధించిన ఇనుప రేకులు గాల్లోకి లేచి చుట్టుపక్కల ఎగిరిపడటంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. రేకులు ఎగిరిపడి చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నప్పటికీ, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ వర్షం, గాలుల ప్రభావంతో పరిసర ప్రాంతాల్లో చెట్లు నేలకూలడం, విద్యుత్ వైర్లపై కొమ్మలు పడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడి జనజీవనం స్తంభించింది. ప్రస్తుతం సంబంధిత అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు ముమ్మరం చేశారు.



## రైతులు అపోహలు, వదంతులు నమ్మవద్దు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్.
- రాజకీయ ప్రేరేపిత అసత్య ఆరోపణలను తోసిపుచ్చిన కలెక్టర్.
- వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ.

**జనం వాయిస్, మంచిర్యాల(మే 26):**
వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు చేస్తున్న అసత్య ఆరోపణలను, అపోహలను మరియు వదంతులను రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లా అధికార యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని, అన్నదాతలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు.



## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్.

ఇటిక్యాల కేంద్రంలో ఆకస్మిక తనిఖీ.

**జనం వాయిస్, మంచిర్యాల (మే 26):**
లక్సెట్టిపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్. లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని ఇటిక్యాల వద్ద కొనుగోలు కేంద్రాన్ని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహశీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నర్సయ్యతో కలిసి ఆయన వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు అధైర్య పడవద్దని, ప్రతి ధాన్యం గింజలు కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఉన్నారు.



## ప్రాణదాతలుగా నిలవండి.

రక్తదానం అందరి బాధ్యత: మేయర్ పిలుపు.
తలసేమియా, సికిల్ సెల్ బాధితుల కోసం మేయర్ ధరణి మధుకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం.



**జనం వాయిస్, మంచిర్యాల, మే 26:**
మంచిర్యాల: రక్తదానం అనేది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గారి ప్రత్యేక చొరవతో.. ప్రధానంగా తలాసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న బాధితులను ఆదుకునేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, మున్సిపల్ సిబ్బంది అత్యంత ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయగా, మొత్తం 100 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రాణాపాయంలో ఉన్నవారిని కాపాడటానికి ముందుకు వచ్చిన రక్తదాతలను ఈ సందర్భంగా మేయర్ ప్రత్యేకంగా అభినందించారు.



# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్త దారుణ హత్య!

**రూ. 3 కోట్ల పాలసీ కోసం ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం.**
**నలుగురు నిందితుల అరెస్ట్, ఒకరు పరారీ.**

**జనం వాయిస్, మంచిర్యాల (మే 26):** మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామంలో రూ. 3 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బుల కోసం, తన వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్నాడనే నెపంతో ఓ భార్య ప్రియుడితో కలిసి భర్తను సుపారీ ఇచ్చి దారుణంగా హత్య చేయించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘోరానికి సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి శరవేగంగా దర్యాప్తు చేపట్టగా, ప్రధాన నిందితురాలైన భార్య భారతి, ఆమె ప్రియుడు సురేందర్‌లతో పాటు హంతకులు రామ్, మల్లేష్‌లను అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల డీసీపీ భాస్కర్ మీడియాకు వెల్లడించారు. కాగా, ఈ కేసులో ప్రమేయం ఉన్న మరో నిందితుడు రామ్‌కుమార్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని డీసీపీ తెలిపారు.



# మేడ్చల్ టౌన్ ప్లానింగ్‌లో అక్రమ నిర్మాణాల కలకలం

**ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ యథేచ్ఛ నిర్మాణాలు.**
**అధికారుల తీరుపై విమర్శలు.**

**మేడ్చల్ మే 26(జనం వాయిస్):** మేడ్చల్ సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ వ్యవస్థ పూర్తిగా గాడితప్పిందనే ఆరోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. నిబంధనలను బేఖాతరు చేస్తూ వందకు పైగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారులు కాసుల కక్కుర్తితో అక్రమ నిర్మాణదారులకు పరోక్షంగా సహకరిస్తున్నారన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణ ప్రణాళిక పూర్తిగా దెబ్బతింటోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండానే భారీ కమర్షియల్ షెడ్లు, బహుళ అంతస్తుల భవనాలు, విలాసవంతమైన స్విమ్మింగ్ పూల్స్ నిర్మాణాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం సమర్థవంతంగా పనిచేయకపోవడంతో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ ఆగని నిర్మాణాలు రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటల పరిరక్షణ కోసం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పలుమార్లు హెచ్చరించింది. ఇందుకోసం ప్రత్యేకంగా హైడ్రా వ్యవస్థను కూడా అమల్లోకి తీసుకువచ్చింది. అయినప్పటికీ మేడ్చల్ సర్కిల్ పరిధిలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది.

తాజాగా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "మేడ్చల్‌లో హైడ్రా నిబంధనలు అమలవుతున్నాయా లేదా?" అంటూ స్థానికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు.




భవిష్యత్తు రోడ్లపైనే అక్రమ నిర్మాణాలు పట్టణ భవిష్యత్తు అవసరాలు, రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా ప్రభుత్వం ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించింది. కొన్ని ప్రాంతాలను భవిష్యత్తు రహదారుల కోసం కేటాయించింది. అయితే ఈ ప్రణాళికలను కూడా పట్టించుకోకుండా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని సమాచారం. టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై రోడ్ల విస్తరణకు కేటాయించిన ప్రాంతాల్లోనే నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ నిర్మాణాలను అడ్డుకోకపోతే భవిష్యత్తులో మేడ్చల్ పట్టణం తీవ్రమైన ట్రాఫిక్, మౌలిక వసతుల సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

"పేదోడికి ఒక న్యాయం.. బడా బాబులకు మరో న్యాయమా?"

అక్రమ నిర్మాణాలపై చర్యల్లో అధికారులు అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిపై ప్రజలు మండిపడుతున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న భారీ కమర్షియల్ కాంప్లెక్స్‌లు, బహుళ అంతస్తుల భవనాలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

అదే సమయంలో జీవనోపాధి కోసం పేదలు వేసుకునే చిన్న రేకుల షెడ్లు, చిన్న ఇళ్లపై మాత్రం వెంటనే కూల్చివేత చర్యలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. "చట్టం పేదవాడిపైనే పనిచేస్తుందా? బడా బాబులకు ప్రత్యేక రక్షణ ఉందా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అధికారిణి స్పందన లేకపోవడంపై అనుమానాలు ఈ అక్రమ నిర్మాణాల వ్యవహారంపై వివరణ కోసం సంబంధిత టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుకన్యను ప్రతినిధి మంగళవారం పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లభించలేదని సమాచారం. అనంతరం వాట్సాప్ ద్వారా పూర్తి వివరాలతో సందేశం పంపినా ఎలాంటి సమాధానం రాలేదని తెలిసింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారిణి ఇలాంటి కీలక అంశాలపై స్పందించకుండా మౌనం పాటించడం పలు అనుమానాలకు తావిస్తున్నదని స్థానికులు అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని మేడ్చల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై, టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జీలుగు సాగుతో అధిక దిగుబడులు.

- 50శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ.
- రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి.

**జనం వాయిస్/చిగురుమామిడి మే26:** వ్యవసాయ పొలంలో రైతులు జీలుగు విత్తనాలు సాగు చేస్తే పొలం సారవంతంగా మారి అధిక దిగుబడులు సాధించవచ్చని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణారెడ్డి తెలిపారు.కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి రైతు వేదికలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణ రెడ్డి, సుందరగిరి గ్రామ సర్పంచ్ జంగ శిరీష రెడ్డిల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చి రొట్ట విత్తనాలు,జీలుగ విత్తనాలను రైతులకు రైతు వేదికలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిగురుమామిడి మండలంనకు 330క్వింటాల్ జీలుగ,50క్వింటళ్లు జనము విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి తెలిపారు.భూసారం పెంపునకు జీలుగ పంట చాలా బాగా పని చేస్తుందని,భూమిలోని పోషకాలను మొక్కలకు అందచేస్తుందని రైతులకు తెలిపారు.30కిలోల బస్తా 2.20ఎకరాల్లో చల్లుకోవాలని,రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు,ఏఈవో అంజలి,అఖిల,రైతులు గుండెకారి మాధవ్,కక్కెర్ల వెంకటేశ్వర్లు గౌడ్,గంధం చంద్రయ్య,కక్కర్ల శ్రీనివాస్ గౌడ్, గోగురు రాజిరెడ్డి,కందుకూరి లక్ష్మణ్,నాంపల్లి ఎల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.




# ఏసీబీ వలలో భారీ తిమింగలం.

**2 లక్షల లంచం తీసుకుంటూ శామీర్‌పేట్ తహసీల్దార్ సుచరిత అరెస్ట్.**
**భూ కన్వర్షన్‌కు రూ.30 లక్షల డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడి.**

**కాప్రా మే 26( జనం వాయిస్):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన దాడులు సంచలనం సృష్టించాయి. శామీర్‌పేట్ తహసీల్దార్ సుచరిత రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కడం జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో



శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సోదాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఘటన వివరాలను వెల్లడించారు. శామీర్‌పేట్ మండలం ఆలియాబాద్ పరిధిలోని సుమారు 30 ఎకరాల భూమి కన్వర్షన్‌కు సంబంధించి రైతు కన్సల్టెంట్ నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై ఏసీబీ విచారణ చేపట్టింది. ఎకరానికి రూ.1 లక్ష చొప్పున మొత్తం రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ డ్రైవర్ ద్వారా రూ.2 లక్షలు తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి సుచరితను పట్టుకున్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో ఎమ్మార్వో సుచరితతో పాటు, మరికొందరు సిబ్బందిని కూడా విచారిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, 2024లో కూడా ఇదే శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసిన ఎమ్మార్వో సత్యనారాయణ రూ.2 లక్షల లంచం కేసులో డ్రైవర్‌తో కలిసి ఏసీబీకి చిక్కిన ఘటన అప్పట్లో సంచలనం రేపింది. తాజాగా మరోసారి అదే కార్యాలయంలో అవినీతి ఆరోపణలు వెలుగులోకి రావడంతో జిల్లాలో విస్తృత చర్చ జరుగుతోంది.

# స్వరూపను పరామర్శించిన ఫౌండేషన్ అధినేత

**మహబూబాబాద్ / జనం వాయిస్ :** కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త స్వరూప అనారోగ్యంతో ఇటీవల హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మి గౌడ్ ఆమెను పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. స్వరూప ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న సమ్మి గౌడ్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్వరూప భర్త నాగెల్లి వెంకన్న, పిల్లలు వంశితేజ, ఇంద్రతేజ, కుటుంబ సభ్యులు నాగెల్లి జనార్దన్‌రమలను కలిసి ఓదార్పు పలికారు. "కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటాం" అంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సమ్మి గౌడ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆశా కార్యకర్తలు ఎండనకా, వాననకా సేవలు అందిస్తున్నారని అన్నారు. గర్భిణీలు, చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ అంకితభావంతో పనిచేస్తున్న స్వరూపలాంటి కార్యకర్తలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు.

## సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న సమ్మి గౌడ్

సామాజిక సేవలను బాధ్యతగా భావిస్తున్న సమ్మి గౌడ్ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సహాయం చేయడం, విద్యార్థులకు ప్రోత్సాహం అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. ఆశా కార్యకర్త స్వరూప చేసిన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకుంటూ, ఆమె త్వరగా కోలుకుని తిరిగి ప్రజల మధ్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆమె పాత్ర చిరస్మరణీయమని పలువురు అభిప్రాయపడ్డారు.



# సీపీఐ ఆధ్వర్యంలో గబ్బిలాలపేట పాఠశాల స్థల సాధనకు నేడు రౌండ్ టేబుల్ సమావేశం

**కాప్రా మే 26( జనం వాయిస్):** గబ్బిలాలపేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కోసం స్థలాన్ని కేటాయించాలనే డిమాండ్ బుధవారం (మే 27) ఒక కీలకమైన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సి.పి.ఐ. మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి శంకర్, కాప్రా మండల కార్యదర్శి . యాదగిరి ఒక ప్రకటన తెలిపారు. గబ్బిలాలపేట పరిసర ప్రాంతాల పిల్లల చదువుల కోసం పాఠశాల స్థలాన్ని సాధించడమే లక్ష్యంగా ఈ పోరాటాన్ని సాగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ సమస్యపై కలిసికట్టుగా ముందుకు సాగేందుకు, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తేది: 27.05.2026 (బుధవారం) సమయం:ఉదయం 11:00 గంటలకు దళిత సంక్షేమ భవన్లో మన పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం, విద్యా హక్కు కోసం సాగుతున్న ఈ పోరాటానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై, మద్దతు తెలిపి జయప్రదం చేయాల్సిందిగా వారు పిలుపునిచ్చారు.




# సూపర్ ఫైటర్ కప్ 2026. తెలంగాణ కరాటే

**జనం వాయిస్ హుస్నాబాద్ మే.26:** ఛాంపియన్షిప్. పోలీస్ హెడ్ కోటర్స్ వారి ఆదేశానుసారం. హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో. సిఐ .ఎస్ఐ .గారి ఆధ్వర్యంలో కరాటే సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. కరీంనగర్ లో. జరిగిన. టోర్నమెంట్.. లో హుస్నాబాద్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. హుస్నాబాద్ సిఐ. గారు. ఎస్ఐ గారు. పిల్లల్ని అభినందించారు. .1) బి కారుణ్య థర్డ్ ప్రైజ్,.2) రివాన్సు థర్డ్ ప్రైజ్.3) ,జి ఆరోహిగౌడ,థర్డ్ ప్రైజ .4)బి రెహనా థర్డ్ ప్రైజ్, బి .5)ఆరాధ్య థర్డ్ ప్రైస్, .6)టీ ప్రిన్స్ థర్డ్ ప్రైజ్, 7)సిహెచ్ శ్రీ వన్ థర్డ్ ప్రైజ్,,.8/ జి ఆరుషి థర్డ్ ప్రైజ్,






# బజానా తండాలో ముమ్మర పోలీస్ తనిఖీలు

**100 కిలోల నల్ల బెల్లం, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం**

**మహబూబాబాద్ / జనం వాయిస్:** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ అంజలి ఆధ్వర్యంలో రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బజానా తండా గ్రామంలో తెల్లవారుజామున "కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం"ను ముమ్మరంగా నిర్వహించారు. ఉదయం 05:20 గంటల నుంచి 07:30 గంటల వరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పోలీసులు గ్రామంలోని సుమారు 120 ఇండ్లు మరియు పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 15 వాహనాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా అక్రమంగా నిల్వ ఉంచిన 100 కిలోల నల్ల బెల్లం, 20 లీటర్ల గుడుంబా, 20 కిలోల పట్టిక, 16 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. స్వాధీనం చేసిన వస్తువులకు సంబంధించి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ అంజలి వెల్లడించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమైన పోలీసులు దొంగతనాలు, ఇంటి చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనలు, రోడ్డు ప్రమాదాల నివారణ, హెల్మెట్ వినియోగం, చెరువుల్లో ఈతకు వెళ్లడం వల్ల కలిగే ప్రమాదాలు, గంజాయి దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు మరియు సీసీ కెమెరాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి విక్రయాలు, గుడుంబా తయారీ వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఫోర్స్, క్యూ ఆర్ టీ ఫోర్స్, ఏఆర్ మహిళా పోలీస్ సిబ్బందితో కలిపి మొత్తం 40 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ, సేఫ్టీ, న్యూట్రిషన్, ఎన్వవర్మెంట్, హెల్త్, ఫర్ ఆడోలసెంట్ (స్నేహ) కిశోర బాలికల సంఘాల నాయకుల అవగాహన కార్యక్రమం, నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హాజరై కార్యక్రమానికి వచ్చిన పిల్లలతో వారు ఎదుర్కొంటున్న పరిస్థితులను స్వయంగా వారితో అడిగి తెలుసుకున్నారు, మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలకు ఏలాంటి సమస్యలు ఎదురైనా ధైర్యంగా పరిష్కరించుకొని ముందుకు సాగాలని,ఆరోగ్యపరంగా ఉన్నప్పుడే అన్ని విధాల మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటామని అందుకు ప్రక్క ప్రణాళిక ప్రకారం ప్రతిరోజు ఉండాలని సూచించారు, ప్రభుత్వం ఆడపిల్లల రక్షణ చదువులు ఆరోగ్యం తదితర అంశాల కోసం అనేక నిధులు కేటాయించి పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ ఆ కార్యక్రమాలను పథకాలను వినియోగించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు, బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 100 బాల్య వివాహాలను నివారించడం జరిగిందని అన్నారు, ఆడపిల్లలు మొబైల్ ఫోన్ సోషల్ మీడియా వాడకం తగ్గించాలని వాటి ద్వారా సమయం వృధా అవుతుందే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు, అపరిచిత వ్యక్తులతో కాల్స్ గాని చాటింగ్ గాని చేయొద్దని



తెలిపారు, ఫోక్సో చట్టం పై ప్రచారం నిర్వహించాలని తెలిపారు, స్నేహ ద్వారా మీ సమస్యలను పరిష్కరించుకోవాలని అట్టి గ్రూపులో మీరు ఎదుర్కొంటున్న పరిస్థితులను చర్చించుకోవాలని తెలిపారు, పదవ తరగతి ఇంటర్మీడియట్ డిగ్రీ ఫౌండేషన్ కోర్సులలో పూర్తిగా నిబద్ధత ఏకాగ్రతతో చదివి ఉద్యోగాలు సాధించాలని తద్వారా తన కుటుంబానికి తల్లిదండ్రులకు అండగా ఉండాలని కోరారు, పూర్తిగా స్థిరపడిన తర్వాతనే వయస్సు వచ్చిన తదుపరి వివాహం చేసుకోవాలని సూచించారు, కొంతమంది పిల్లలు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ తన జీవితంలో జరిగిన సంఘటనల ద్వారా వివరించి పిల్లలకు తెలిపారు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తుందని, పౌష్టిక మైన, రుచికరమైన ఆహారం బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, స్నాక్స్ అందిస్తున్నాయని వాటిని ఉపయోగించుకొని ఆరోగ్యంగా చదువులోనూ ముందుకు సాగాలని కలెక్టర్ పిల్లలకు సూచించారు, అనంతరం బాల్యవివాహాల నివారణపై పోస్టర్ ఆవిష్కరించారు, ఆరోగ్య సమస్యలు రాకుండా న్యూట్రిషన్ హెల్త్ ప్రొఫైల్ మైంటైన్ చేయాలని, తమ తల్లిదండ్రులకు అంతర్ పంటలపై పంట మార్పిడి విధానంపై అవగాహన కల్పించాలని, ప్రతి సమస్యకు పరిష్కారం తప్పకుండా ఉంటుందని ఎవరూ నిరాశ పడవద్దని తెలిపారు, పిల్లలు తెలిపిన సమస్యలు రోడ్ల నిర్మాణము, వసతి గృహాలలో ఏర్పాట్లు, ఆర్టీసీ రవాణా సదుపాయం, తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు తీసుకుని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, వెల్ఫేర్ అధికారిని సబిత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

# నార్కోటిక్ డాగ్ "మ్యాక్స్"తో కేసముద్రంలో గంజాయి వ్యతిరేక తనిఖీలు

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు కేసముద్రం పోలీసులు నార్కోటిక్ డాగ్ "మ్యాక్స్" సహాయంతో మంగళవారం విస్తృత కూంబింగ్, తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, యువత గుమికూడే ప్రాంతాలు, గంజాయి సేవిస్తున్నట్లు అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కేసముద్రం ఎస్సైలు కె. క్రాంతి కిరణ్, నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో నార్కోటిక్ డాగ్ "మ్యాక్స్", డాగ్ హ్యాండ్లర్ శివరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని, క్షణిక ఆనందం కోసం జీవితాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని, యువత చదువు, ఉద్యోగం, క్రీడల వైపు దృష్టి పెట్టాలని కోరారు. గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వారు 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఎస్సై క్రాంతి కిరణ్ మాట్లాడుతూ కేసముద్రం పరిధిలో మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, గంజాయి సేవిస్తూ లేదా విక్రయిస్తూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ డాగ్ "మ్యాక్స్", డాగ్ హ్యాండ్లర్ శివరాజ్, కేసముద్రం పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

- అర్హులైన రైతులందరికీ ప్రభుత్వ పరంగా కచ్చితంగా న్యాయం జరుగుతుంది.
- మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్.

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో మహబూబాబాద్ నియోజకవర్గం నెల్లికుదురు, ఇనుగుర్తి, కేసముద్రం, గూడూరు, మహబూబాబాద్ మండలాల పరిధిలో ఫారెస్ట్, రెవెన్యూ, అసైన్డ్ వ్యవసాయ భూముల పరిష్కార సమన్వయ సమావేశం మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరిష్ లఅధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్ , తహసిల్దార్లు, ఏడి సర్వే ల్యాండ్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా మహబూబాబాద్



శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి ఫారెస్ట్ అసైన్డ్ భూ సమస్యల పరిష్కారం కోసం మండల రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని పరిష్కరించాలని తద్వారా పేద ప్రజల మనసుల్లో అధికారులు ఉంటారని తెలిపారు, అందుకు కలెక్టర్ గారు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు, జెన్ సిపాయి భూములు మొదటి వార్ లో తరతరాల నుండి వారికి వచ్చాయని , అట్టి మండలాలు నెల్లికుదురు, నరసింహ గూడెం సుమారు 250 ఎకరాలు ఉంటాయన్నారు, అలాగే సీతానగారం, గుండెంగా, ముడుపుగల్, నారాయణపురం, నియోజకవర్గ పరిధిలో ఉన్నటువంటి చిన్న చిన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కోర్టులో ఉన్న భూ సమస్యల కోసం కలెక్టర్ గారు హైదరాబాద్ స్థాయి, భూ పరిపాలన కమిషనర్ గారిచే చర్చించి ప్రత్యేక దృష్టి పెట్టి క్షేత్రస్థాయిలో జాయింట్ సర్వే నిర్వహించి అర్హులైన నిరుపేద వారికి అందించాలని ఆయన కోరారు, గతంలో రైతులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని నిజమైన లబ్ధిదారులు ప్రస్తుతం ఉన్నారని వారిని మాత్రమే గుర్తించాలని, పేద ప్రజలకు సహాయం చేస్తే ఉద్యోగ తృప్తి లభిస్తుంది అని ఎమ్మెల్యే తెలిపారు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఫారెస్ట్, రెవెన్యూ రైతుల భూ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల వారు జాయింట్ సర్వే నిర్వహించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, సూచించారు,పని ఒత్తిడి ఉన్న గాని ప్రత్యేకంగా ఈ భూ సమస్యలను పరిష్కరించి అర్హులైన నిరుపేదలకు పట్టాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం తరఫున కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు, ఈ సమావేశంలో మహబూబాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ గుగులోతు జ్యోతి,రెవెన్యూ, సర్వే సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

# మిల్లర్ల దోపిడీపై ప్రభుత్వం విచారణ జరపాలి...!

**కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తీవ్ర ఇబ్బందులు. అయిలేని మల్లికార్జున రెడ్డి హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు.**

**జనం వాయిస్ హుస్నాబాద్ మే.26:**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం కూచనపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ రైతులు భారీ పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరికి మిల్లర్ల దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు సక్రమంగా జరగక రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు రైస్ మిల్లర్లు చెప్పిందే అమలు చేస్తున్నారని విమర్శించారు. 40 కిలోల బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు అదనంగా తూకం వేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, ఒక్కో క్వింటాకు సుమారు ఆరు కిలోల వరకు రైతులకు నష్టం జరుగుతోందన్నారు.అలాగే ధాన్యాన్ని మిల్లులకు తరలించిన తరువాత ఏ గ్రేడ్, బీ గ్రేడ్ అనే తేడా లేకుండా కామన్ గ్రేడ్ గా చూపించి ప్రభుత్వ గిట్టుబాటు ధర కంటే క్వింటాకు రూ.20 వరకు కోత విధిస్తున్నారని ఆరోపించారు. మిల్లర్ల దోపిడీ ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించిన ఆయన, ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మిల్లర్ల దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అయిలేని గాల్ రెడ్డి, మంద జానకిరామ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# జూన్ మొదటి వారంలో కవిత చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ.

**పాంచజన్యంతో పేదలకు న్యాయం చేస్తాం.
ఉచిత విద్య, వైద్యం, ఉపాధి అందించడమే లక్ష్యం.
టిఆర్ఎస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ జెండా పండుగ ఇన్చార్జి పూరెల్ల శ్రావణ్ కుమార్ గౌడ్.**



**జనం వాయిస్ హుస్నాబాద్ మే 26:**
తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) పార్టీ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ జెండా పండుగ ఇన్చార్జి శ్రావణ్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ లో పార్టీ జెండా గద్దె నిర్మాణం కోసం నాలుగు ప్రదేశాలను పరిశీలించి మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేసామని, వాటిలో ఒక చోట జెండా గద్దె ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. జూన్ మొదటి వారంలో జెండా గద్దెను ఏర్పాటు చేసి పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల ఆకాంక్షల సాధనే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి గుండెకాయగా ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోయిన గుడాటిపల్లి, తెనుగుపల్లి గ్రామాల భూ నిర్వాసితులకు ఇప్పటికీ పూర్తి పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా కొందరిపై కేసులు కొనసాగుతున్నాయని, భూ నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ ప్రకటించిన "పాంచజన్యం"లో భాగంగా ప్రజలకు ఐదు ప్రధాన హామీలను అందిస్తున్నామని తెలిపారు. అందులో ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతులకు గిట్టుబాటు ధరతో పాటు పంట కొనుగోళ్లలో ప్రభుత్వ హామీ, సాగునీటి సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయం వంటి అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలను జెండా పండుగ ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం రెండూ గౌరవెల్లి ప్రాజెక్టు విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో దివంగత వైఎస్సార్ గౌరవెల్లి ప్రాజెక్టును 1.4 టీఎంసీలతో ప్రారంభించగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మాజీ సీఎం కేసీఆర్ దాన్ని 8.4 టీఎంసీలకు విస్తరించినప్పటికీ రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చినా అమలులో విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ టిఆర్ఎస్ పార్టీ నాయకులు బెజ్జంకి సంజీవ్, అంబాల వెంకటేష్, కొమ్మల కుమార్, రాగటి సందీప్, యువజన ప్రతినిధులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించిన లేగా రామ్మోహన్ రెడ్డి

**పాలకుర్తి మే 25,జనం వాయిస్:**
జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో ఐకెపి కొనుగోలు కేంద్రాలలో అధికారుల నిర్లక్ష్యం వలన వడ్లు రెండు నెలలుగా కొనుగోలు జరగక వడ్ల కళ్ళలోనే రైతులు ఇబ్బందులు పడుతున్న సందర్భంగా వారికి గన్ని బ్యాగులు రాక,తూకాలుగాక సరైన సమయంలో లారీలు రాక ఇబ్బంది పడుతున్న దృశ్య మండలంలోని పాలకుర్తి,ఎల్లరాయిని తొర్రూర్ ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకుని స్థానిక తహసిల్దార్ సరస్వతికి సమస్యలు వివరించారు.బస్తకు రెండు కేజీలు ఎక్కువగా కాంటాలు వేస్తూ అదనంగా డబ్బులు వసూలు చేస్తు రైతులను ఇబ్బందులు పెడుతున్న విషయాన్ని తాసిల్దార్ కి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓట్ల కొనుగోలు తక్షణమే జరిగేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు రంగు రాములు,పల్లె కుమార్, చింత సృజన్, జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, సీనియర్ నాయకులు మడపల్లి సోమన్న, మండల అధ్యక్షులు నూనె అనిల్, రాజేష్, గట్టు రాంబాబు, భాస్కరాచారి,పెండ్యాల గణేష్, గోనే అమరేందర్, చల్ల వినయ్,బత్తోజు శ్రవణ్, బెల్లి సతీష్,నియోజకవర్గ, మండల నాయకులు పాల్గొన్నారు.



# 18 దాటకుండా పెళ్లా? చట్టం చుట్టం కాదు లోపలేస్తారు జాగ్రత్త

**జనం వాయిస్, ముత్తారం, మే 26:**
యువతులకు 18 సంవత్సరాలు, యువకులకు 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులతో పాటు సహకరించిన వారికి కూడా చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ముత్తారం మండలం హరిపురం గ్రామ సర్పంచి మెంగని సమత తిరుపతి హెచ్చరించారు. మంగళవారం హరిపురం గ్రామపంచాయతీ పరిధిలోని స్థానిక అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రామస్తులకు బాల్య వివాహాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమత తిరుపతి మాట్లాడుతూ సమాజానికి బాల్య వివాహాలు శాపమని చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల పిల్లల భవిష్యత్తు నాశనమవ్వడమే కాకుండా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలని గ్రామంలో ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ అవగాహన సదస్సులో ఉపసర్పంచ్ కూస తిరుపతి, అంగన్‌వాడీ టీచర్ శ్రీపెల్లి సరోజన, వార్డు సభ్యులు ఏగుర్ల జ్యోతి రాజు, రామంచ స్వరూప రాజేష్, పాటు పలువురు గ్రామస్థులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

**మే 26 జనం వాయిస్ పాలకుర్తి:**
పాలకుర్తి నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో హనుమన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 29న శ్రీ పాలకుర్తి మండలంలోని సోమేశ్వర కళ్యాణ మండపంలో భారీ ఉచిత జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడే ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నాయని పేర్కొన్నారు. 10వ తరగతి నుండి పీజీ వరకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను పాలకుర్తి బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ మరియు పాలకుర్తి మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి మీడియాకు వెల్లడించారు.



# సీఎం ప్రకటించిన వేతనాల సవరణ కార్మికులకు వ్యతిరేకమా?

### మున్సిపల్ కార్మిక సంఘాల ఆగ్రహం.. రూ.26 వేల కనీస వేతనం డిమాండ్

**మేడ్చల్ మే 26(జనం వాయిస్ ):**
తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల వేతనాల సవరణ అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కనీస వేతనాల పెంపుపై మున్సిపల్ కార్మిక సంఘాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన వేతనాల సవరణ కార్మికులకు అనుకూలంగా కాకుండా, వ్యతిరేకంగా ఉందంటూ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ & కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నాయకులు మండిపడుతున్నారు. గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన సంఘ సమావేశంలో రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.యేసు రత్నం మాట్లాడుతూ, కార్మికులను మూడు వర్గాలుగా విభజించి ప్రభుత్వం అన్యాయం చేసిందని విమర్శించారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ. 16 వేల కనీస వేతనం, స్కిల్డ్ కార్మికులకు రూ. 20 వేల వేతనం అమలు చేస్తున్నామని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న నిత్యావసర ధరలు, జీవన వ్యయాలను దృష్టిలో పెట్టుకుని కనీస వేతనాన్ని రూ. 26 వేలుగా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల కారణంగా మున్సిపల్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఇక రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 30 వేల అంత్యక్రియల సాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 15 క్యాజువల్ లీవ్స్ మంజూరు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే అమలు చేయాలని కోరారు. జూన్ 23, 24 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్ర మున్సిపల్ మహాసభలను విజయవంతం చేయాలని సమావేశంలో నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బి. రమేష్ అధ్యక్షుడిగా, బి. ప్రభాకర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, వి. హరినాథ్ రావు ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశం మున్సిపల్ కార్మికుల సమస్యలను మరోసారి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లింది. వేతనాల పెంపు పేరుతో ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు వాస్తవ పరిస్థితులకు సరిపోవడం లేదని కార్మిక సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.



# అయ్యగారిపల్లిలో ఘనంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

### ఫైనల్లో తట్టుపల్లిపై అయ్యగారిపల్లి జట్టు విజయం

**కురవి / జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లి గ్రామంలో ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో పలు గ్రామాలకు చెందిన జట్లు పాల్గొని తమ ప్రతిభను కనబరిచాయి. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లతో క్రీడాభిమానులను అలరించిన ఈ టోర్నమెంట్ చివరికి ఫైనల్ మ్యాచ్‌కు చేరుకుంది. ఫైనల్ పోటీలో అయ్యగారిపల్లి జట్టు, తట్టుపల్లి జట్టుతో తలపడింది. చివరి వరకు నువ్వా-నేనా అన్నట్టుగా సాగిన ఈ మ్యాచ్‌లో అయ్యగారిపల్లి జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి విజేతగా నిలిచింది. తట్టుపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఇక కురవి జట్టు తృతీయ స్థానం దక్కించుకుంది. మ్యాచ్ అనంతరం విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. మొదటి బహుమతిని తిరుమల ఇండస్ట్రీస్ యాజమాన్యం, రెండవ బహుమతిని జిన్నా నాగమ్మ జ్ఞాపకార్థంగా జిన్నా కృష్ణ, జిన్నా చింటూ, మూడవ బహుమతిని చెర్వీరాల కృష్ణయ్యసరోజిని అమ్మ గారి జ్ఞాపకార్థంగా చెర్వీరాల నవీన్, ప్రవీణ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యగారిపల్లి గ్రామ సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న, వార్డ్ సభ్యులు గంట హరీష్, జిన్నా విజయ్, తిరుమల ఇండస్ట్రీస్ యాజమాన్యం, జిన్నా కృష్ణ, చెర్వీరాల కార్తీక్, క్రీడాకారులు, క్రీడాభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# భూ బకాసురుల సంగతింకెప్పుడు.!?

... ప్రజాపాలన పేరుతో భూమాఫియాకు రాజ్యాభిషేకమా..?.
... హామీలు గాల్లో.. ప్రభుత్వ భూములు కబ్జాల్లో.. ప్రశ్నించే ప్రజలకు సమాధానం ఎక్కడ..?.
... "ప్రజాపాలన వచ్చిందా..? లేక పాత పాలనకే కొత్త రంగు పూశారా..?".
... హామీలు ఘనం.. ఆచరణ శూన్యం అంటూ మహబూబాబాద్ ప్రజల ఆగ్రహం.
... ఓం నారాయణపై "మరో భూపోరాటం" : ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమా నాయక్.
... కలెక్టర్ కు పిర్యాదు చేసిన ఫలితం లేదు : సామాజికవేత్త గండమల్ల రామకృష్ణ.
... చెరువులు, కుంటలపై సర్వే నిర్వహించాలి : బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్.





జనం వాయిస్
విచారణ అటకెక్కిందా..?
దర్జాగా భూ కబ్జా
మహబూబాబాద్‌కు 'వరద' ముప్పు..!
చెరువులు, కుంటలు.., హాంఫట్!

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
"అవినీతి పాలన పోయింది.. ప్రజాపాలన వచ్చింది" అని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా, భూకబ్జాలు, అవినీతి, రైతుల భూ సమస్యల విషయంలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదని మహబూబాబాద్ ప్రజలు మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు మారినా, అధికారులు మారినా, రెవెన్యూ వ్యవస్థలో అవినీతి యథాతథంగానే కొనసాగుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాపాలన వచ్చిందన్నారు..! అవినీతి పాలన పోయిందన్నారు..! ధరణి దోపిడీకి చెక్ పెడతామన్నారు..! భూబకాసురుల భరతం పడతామన్నారు..! గత ప్రభుత్వ హయాంలో ధరణి పేరిట భూమాఫియా రాజ్యమేలిందని, వేలాది మంది రైతులు నష్టపోయారని ఎన్నికల సమయంలో తీవ్ర విమర్శలు చేసిన ప్రస్తుత పాలకులు అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారని బాధితులు ఆరోపిస్తున్నారు. "ధరణికి బదులుగా భూభారతి వస్తే రైతులకు న్యాయం జరుగుతుంది" అని చెప్పినా, ఇప్పటికీ రైతులు రెవెన్యూ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ భూములు కబ్జాలోనే.., చర్యలు ఎక్కడ..?

స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్ తో పాటు రాష్ట్ర ముఖ్య సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ జిల్లా ఇంచార్జి శ్రీనివాస్ రెడ్డి ఉన్నా గతేడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీలేమో గాని భూ కబ్జాదారుల ఆగడాలపై చెక్ పెట్టలేక పోతున్నారు. భూ కబ్జా దారులతో తెరవెనుక మంతనాలు ఏమైనా జరిగాయా..? ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహబూబాబాద్ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురై ఉన్నాయని, వాటిని స్వాధీనం చేసుకోవడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని ప్రజలు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వంలో మాజీ ప్రజాప్రతినిధులు అనుచరగణం భూదందాలకు పాల్పడి రైతుల భూములతో పాటు ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేసిందని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ప్రజాపాలన వస్తే పూసికపుల్లంత భూమిని కూడా వదిలిపెట్టను.. కబ్జాదారుల సంగతేంటో చూస్తా" అంటూ ప్రజలకు హామీ ఇచ్చి సార్లు, అధికారంలోకి వచ్చి రెండేళు గడుస్తున్నా భూకబ్జాలపై స్పష్టమైన చర్యలు తీసుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

### హైడ్రా తరహా చర్యలు ఎక్కడికి పోయాయి..?

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచార సభల్లో మహబూబాబాద్‌లో "భూ బకాసురులు వేల ఎకరాల ప్రభుత్వ భూములు మింగేశారు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాపాలన వస్తే భూకబ్జాలకు చెక్ పెడతామని, చెరువులు, కుంటలు కాపాడతామని హామీ ఇచ్చారు. అకాల వర్షాల అనంతరం మహబూబాబాద్ పర్యటనలో కూడా హైదరాబాద్ "హైడ్రా" తరహాలో ప్రత్యేక చర్యలు తీసుకుని చెరువులు, కుంటలు, నాలాలను రక్షించాలని మంత్రులకు, జిల్లా అధికారులకు సీఎం సూచనలు చేసినప్పటికీ, ఏడాది గడిచినా ఆచరణలో మాత్రం ఎలాంటి పురోగతి కనిపించలేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

### ప్రజల ప్రశ్నలకు సమాధానం ఎప్పుడు..?

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..? భూకబ్జాదారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు..? ప్రభుత్వ భూములా? ప్రయివేట్ భూములా..? ఎందుకు తేల్చడం లేదు..? అనే ప్రశ్నలు ప్రస్తుతం మహబూబాబాద్ ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. "ప్రజాపాలన" పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, భూకబ్జాలు, అవినీతి, రెవెన్యూ అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో అసంతృప్తి మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

### ఓం నారాయణపై "మరో భూపోరాటం" : ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమా నాయక్

మహబూబాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ నాయకుడు ఓం నారాయణ వివిధ ప్రాంతంలో భారీ స్థాయిలో ప్రభుత్వ భూమి ఆక్రమణ జరిగిందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమా నాయక్ ఆరోపించారు. మహబూబాబాద్ పట్టణంలో 107 సర్వే నెంబర్ లో ఉన్న 1: 34 గంటలు.., వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై అక్రమ కట్టడాలు నిర్మించినా పాలకులు, అధికారులు స్పందించడం లేదని ఆయన మండిపడ్డారు. ఇవే కాదు క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తే వేల కోట్లు విలువ చేసే సుమారు 30 ఎకరాలు బయటకు వస్తాయన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ముఖ్యసలహాదారులు వేం నరేందర్ రెడ్డి, తో పాటు కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేస్తామని స్థానిక ఎమ్మెల్యే మురళి నాయక్ ఎందుకు భూపోరాటాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల విషయంలో స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేయడం వెనుక అంతర్యం ఏమిటని ఆయన నిలదీశారు.

### ఆర్తిరెడ్డి గార్డెన్ పై చర్యలు తీసుకోవాలి : సామాజికవేత్త గండమల్ల రామకృష్ణ

మహబూబాబాద్ పట్టణంలోని గుమ్ముడూరు గ్రామ చివారు లోని సర్వే నెంబర్ 287లో 7:10 ఎకరాల ప్రభుత్వ భూమిని శ్రీ రామాసహాయం వెంకట్ రెడ్డి ఆక్రమించినట్లు 2012లో సర్వే నిర్వహించి ఆర్తిగార్డెన్ ను సీజ్ చేశారు. ఆర్తి రెడ్డి గార్డెన్ వ్యవహారం కూడా మళ్లీ చర్చనీయాంశంగా మారింది. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని సామాజికవేత్త గండమల్ల రామకృష్ణ కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ కు అనేక మార్లు పిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడంలో రెవిన్యూ శాఖ అధికారులు విఫలం చెందారు. ఇప్పటికీ నిర్వాహకులు యథేచ్ఛగా కొనసాగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. పక్కా ఆధారాలు ఉన్నప్పటికీ ప్రస్తుత పాలకులు, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

### చెరువులు, కుంటలపై సర్వే నిర్వహించాలి : బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్

పట్టణంలోని పూర్వకాల చెరువులు, కుంటలు, నాలాలు క్రమంగా ఆక్రమణలకు గురై వెంచర్లు, అక్రమ నిర్మాణాలకు కేంద్రాలవుతున్నాయని బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న వర్షానికే మహబూబాబాద్ పట్టణం జలమయం కావడం దీనికే నిదర్శనమన్నారు. ముఖ్యంగా బంధం చెరువు అక్రమణకు గురైందని, వర్షాకాలానికి ముందే చెరువులు, నాలాలు, శిఖాలు, కుంటలపై సమగ్ర సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే భవిష్యత్తులో పట్టణం తీవ్ర వరద ముప్పును ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.







# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలు

### ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీజేపీ ఆగ్రహం

**కురవి / జనం వాయిస్:**
తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని బీజేపీ నాయకులు మండిపడ్డారు. మంగళవారం కురవి మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కురవి మండల బీజేపీ అధ్యక్షుడు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సందర్శించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యాం సుందర్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద సరైన మౌలిక వసతులు లేకపోవడం, ధాన్యం తూకాల్లో తీవ్ర జాప్యం, గన్నీ సంచుల కొరత, రైతులకు సమయానికి టోకెన్లు ఇవ్వకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. గన్నీ సంచుల్లో నింపిన వడ్లను లోడ్ చేయడానికి లారీలు సమయానికి రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యం కేంద్రాల్లోనే నిల్వ ఉండి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. తీవ్రమైన ఎండలు, వడగాలుల నేపథ్యంలో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రైతులు రాత్రింబవళ్లు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నా అధికార యంత్రాంగం సరైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం మాటల్లో మాత్రమే రైతు ప్రేమ చూపిస్తూ, క్షేత్ర స్థాయిలో రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. తేమ శాతం 13.5 శాతం వచ్చినప్పటికీ ధాన్యం కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. తక్షణమే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీరామోజు నాగరాజు, కురవి మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి జిన్నె కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కోడి రామకృష్ణ, సీనియర్ నాయకులు కొనతం పెంటయ్య, జిన్నె నరేందర్, నిమ్మశెట్టి సత్యం, కొత్త వెంకన్న, బీ నారాయణ, రమేష్ నాయక్ తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి బియ్యం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు.

**జనం వాయిస్.చిగురుమామిడి, మే.26:**
చిగురుమామిడి:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన బట్టు అయిలయ్య ఇటీవల మృతిచెందగా సుందరగిరి గ్రామ బిఆర్ఎస్ పార్టీ వార్డు సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబానికి మంగళవారం 25కేజీల బియ్యం అందజేశారు.ఐలయ్య మృతికి గల కారణాలను వారి కుమారులు బట్టు బిక్షపతి,బట్టు సంపత్,బట్టు శ్రీనివాస్ లను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్ కుమార్,పెసరి రాజాకృష్ణ, పెసరి ప్రమీల శ్రీనివాస్,మంథని ప్రియాంక మహేందర్,కావటి మంజుల అనిల్,కాషబొయిన రమేష్,మాజీఉపసర్పంచ్ జీల సంపత్,యాదవ సంఘం నాయకులు జీల చంద్రమోళి,జీల సంపత్,జీల సమ్మయ్య,తదితరులు పాల్గొన్నారు.



# తంగాళ్లపల్లి రైతు వ్యవసాయ క్షేత్రం అగ్నికి ఆహుతి రూ.8 లక్షల నష్టం

**జనం వాయిస్ కోహెడ, మే 26:**
కోహెడ మండలం తంగాళ్లపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మడికట్టు కాల్చడంతో చెలరేగిన మంటలు రైతు వ్యవసాయ క్షేత్రాన్ని పూర్తిగా దహనం చేశాయి. ఈ ఘటనలో సుమారు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. గ్రామానికి చెందిన రైతు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు పొదిల సంధ్య-తులసిరామ్ కుటుంబానికి చెందిన రెండెకరాల వరిపంట, 200 స్పింకర్ పైపులు, మూడు ఎకరాల మల్బర్ తోట, డ్రిప్ పైపులు, వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న ట్రాక్టర్ ఇంజన్, కరెంట్ సర్వీస్ వైర్లు మంటల్లో కాలిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం గుర్తుతెలియని రైతు మడికట్టు అంటించగా, గాలికి మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న వ్యవసాయ క్షేత్రానికి వ్యాపించినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం పొలం వద్దకు వెళ్లి చూసేసరికి పంటలు, పైపులు, తోటలు, వ్యవసాయ సామగ్రి కాలిపోయి బూడిదై కనిపించడంతో రైతు కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటన జరిగి నాలుగు రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని, అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లడం తప్ప రైతుకు భరోసా కల్పించలేదని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద నష్టం జరిగిన విషయాన్ని బయటకు తెలియకుండా దాచిపెట్టడం సరికాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతు కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.



